క్లుప్తంగా

మధుసూదన్‌రెడ్డికి పరామర్శ



మధుసూదన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: మండలంలోని రాజుపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నేత, మాజీ మండల కన్వీనర్‌ దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డిని శనివారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. ఇటీవల ఆయన ఇంటి వద్ద పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న సంజీవయ్య గ్రామానికి చేరుకుని ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఆయన వెంట మండల కన్వీనర్‌ పాదర్తి హరనాథ్‌రెడ్డి, యువత అధ్యక్షుడు బట్టా పృథ్వీకుమార్‌యాదవ్‌, కోఆప్షన్‌ సభ్యుడు ఖాదర్‌బాషా, నాయకులు తిరుపాయ్య, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను సహించం

పెళ్లకూరు: అమాయకులైన దళితులపై అగ్రవర్ణాల వారు దాడులకు పాల్పడితే సహించేదిలేదని దళిత నాయకుడు యాగాని బెన్నీ తెలిపారు. ఆయన శనివారం పెళ్లకూరులో విలేకరులతో మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలో దళితుడిపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. ప్రజాస్వామ్యంలో అందరూ సమానమేనని గుర్తు చేశారు. బలహీనులైన దళితులపై దాడులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. నాయకులు వాసు, పోలయ్య, రమణయ్య, సుబ్రమణ్యం, శివ, గురవయ్య, ఏడుకొండలు ఉన్నారు.

నేడు నేత్రదాన శిబిరం

కలువాయి: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నేత్రదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఇండియన్‌ రెడ్‌క్రాస్‌ సొసైటీ కలువాయి సబ్‌ బ్రాంచ్‌ చైర్మన్‌ పెంచల పుల్లయ్య తెలిపారు. ఇందులో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాల కంటి వైద్య నిపుణులు డాక్టర్‌ శైలజ పాల్గొంటారని తెలిపారు. కలువాయి రెడ్‌క్రాస్‌ సభ్యులు, యువత నేత్రదానానికి ముందుకు రావా లని పిలుపునిచ్చారు.

సీఆర్‌ఎంటీకి పురస్కారం

కలువాయి: మండలంలో విద్యాశాఖలో క్లస్టర్‌ రిజర్వ్‌ మొబైల్‌ టీచర్‌(సీఆర్‌ఎంటీ)గా పనిచేస్తున్న తుమ్మల నాగేశ్వరరావుకు కాకినాడకు చెందిన చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ రాష్ట్ర స్థాయి విశిష్ట సేవా విద్యా పురస్కారం అందజేసింది. కాకినాడ సూర్యకళామందిర్‌లో శనివారం జరిగిన చేయూత 7వ వార్షికోత్సవ సమావేశంలో అవార్డును అందజేశారు. విద్యాశాఖలో చేస్తున్న కృషికి, సేవలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా చేయూత సంస్థ 13 మందిని ఎంపిక చేసింది. వారిలో నాగేశ్వరరావు ఒకరు. పురస్కారం అందుకున్న నాగేశ్వరరావును ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారుల దాడులు

పెళ్లకూరు: మండలంలోని కలవకూరు, ముమ్మారెడ్డిగుంట, పుల్లూరు సమీపంలోని స్వర్ణముఖినది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా శనివారం రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. ఇసుక రవాణపై స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్‌ ద్వారకానాథ్‌రెడ్డి స్పందించి రెవెన్యూ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సంతోషిణిబాయి, వీఆర్వోలు కళ్యాణి, రమేష్‌ పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పోలేరమ్మ జాతర ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరిశీలించారు. అమ్మవారి కుమ్మరిల్లు, జీనుగులవారి వీధిలోని అమ్మవారి మెట్టినిల్లు మండపం, నిష్క్రమణం చేసే ప్రదేశాన్ని పరిశీలించి పనులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 25, 26 తేదీన జరగబోయే పోలేరమ్మ జాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈవో శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ అబ్దుల్‌రషీద్‌ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



అనీల్‌

నాయుడుపేట టౌన్‌ : పట్టణంలోని బూచయ్య కాంప్లెక్స్‌ వద్ద ఉంటున్న యువకుడు అదృశ్యమయ్యాడు. ఓజిలి మండలం రుద్రాయపాళెంకు చెందిన డి.అనీల్‌ మేనకూరులోని ఓ పరిశ్రమలో పనిచేస్తూ నాయుడుపేటలో నివాసం ఉంటున్నాడు. 12 తేదీ ఇంటికి వెళతున్నట్టు చెప్పాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తీగల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్‌..

దక్కిలి : మండలంలోని పాతనాలపాడు దళితవాడ (రామరాజుపల్లి)లో రోడ్డు పక్కన రైతు తోటలో విద్యుత్‌ మెయిన్‌ లైన్‌కు అల్లుకున్న చెట్ల తీగలను విద్యుత్‌ శాఖ సిబ్బంది తొలగించారు. విద్యుత్‌ లైన్‌కు చెట్ల తీగలు అల్లుకున్న విషయంపై ఈ నెల 13న అల్లుకున్న నిర్లక్ష్యం అన్న శీర్షిన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ట్రాన్స్‌కో లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ మురగానందం తమ సిబ్బందితో కలిసి శనివారం చెట్ల తీగలను తొలగించారు.

ప్రభుత్వం పునరాలోచించాలి



డాక్టర్‌ కావాలనే విద్యార్థులు పడుతున్న కష్టానికి తగిన ఫలితం వస్తుందో రాదో అన్న సందేహం నెలకొంది. గతేడాది మాదిరిగా ఈ యేడాది కూడా ఐదు కొత్త కాలజీలకు అనుమతులు వచ్చి ఉంటే 750 సీట్లు పెరిగేవి. చాలామంది డాక్టర్‌ కల నెరవేరేది. ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయాలని లేఖ రాయడం తగదు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించాలి.

– గుంటమడుగు గీతాంజలి, రాజుల ఎరుగుంటపాళెం, సైదాపురం



పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్నారు



వైద్య కళాశాలలను ప్రైవేట్‌ పరం చేస్తే మాలాంటి వాళ్లు రూ.లక్షలు ఖర్చు చేసి వైద్య విద్యను చదివించలేరు. తద్వారా పేద, మధ్య తరగతి పిల్లలకు వైద్య విద్య అందకుండా చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన సరైంది కాదు. వెంటనే తన నిర్ణయాన్ని విరమించుకుని కొత్త కళాశాలల ప్రారంభానికి సహకరించాలి.

– తిరకాల భాస్కర్‌ పేరెంట్‌, ఊటుకూరు ,సైదాపురం

ఆక్రమణలో ప్రభుత్వ భూములు

దొరవారిసత్రం మండలంలోని నెలబల్లి గ్రామం జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. ఇక్కడ ఎకరా భూమి రూ.లక్షలు పలుకుతోంది. దీంతో కొంతమంది పెద్దల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. అసైన్డ్‌ భూములను యథేచ్ఛగా ఆక్రమించుకున్నారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– దొరవారిసత్రం

- ఫిర్యాదులు అందినా పట్టించుకోని అధికారులు
- ఆక్రమణలో 80 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి



నెలబల్లి ప్రాంతంలో టైల్స్‌ కంపెనీకు చెందిన వివిధ కట్టాడాలు

దొరవారిసత్రం మండలం నెలబల్లి రెవెన్యూ పరిధిలోని రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబరు 3లో 885 ఎకరాలకు పైగా అటవీ భూమి ఉంది. ఇందులో సుమారు 300 ఎకరాలను 100 మందికి 319, 320, 321, 322, 324, 325,326,327, 328, 331, 332 తదితర సర్వే నంబర్లుగా విడగొట్టి శ్రీహరికోటకు భూములు ఇచ్చిన వారికి పునరావాసం కింద పంపిణీ చేశారు. ఈ భూములను 15 ఏళ్ల క్రితం కొందరు బడా భూస్వాములు కొనుగోలు చేసి సాగుకు అనువుగా చేసుకున్నారు. వీటికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. వారికి రెవెన్యూ అధికారులు సహకరించారు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి నెల్లూరు జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ రామయ్య 2011–12లో ఐదుగురు సర్వేయర్లతో భూములను సర్వే చేయించారు. భూస్వాములు కొనుగోలు చేసిన 300 ఎకరాల్లో 80 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించారు. బడా భూస్వాముల నుంచి ప్రభుత్వ భూమి వెలికి తీసేలోపు జేసీ బదిలీపై వెళ్లిపోయారు. తర్వాత వచ్చిన అధికారులు ఈ విషయం గురించి పట్టించుకోలేదు.

ప్రభుత్వ భూమి ఆక్రమణలు మళ్లీ తెరపైకి...

నెలబల్లి ప్రాంతంలో ప్రభుత్వ భూమి ఆక్రమణల విషయం మళ్లీ తెరపైకి రావడంతో తమకు సాగు భూమి దక్కుతుందని పలువురు పేదలు ఆశించారు. బడా భూస్వాముల్లో ఒకరు ఇటీవల 83 ఎకరాలను ఒక టైల్స్‌ కంపెనీ వారికి అమ్మేశారు. ఇందులో కూడా 20 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉన్నట్లు నెలబల్లికి చెందిన అధికార పార్టీ నాయకులు, రైతులు చెబుతున్నారు. ఇక్కడ ఎకరా భూమి రూ.12 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు ధర పలుకుతోంది. టైల్స్‌ కంపెనీ వారు కొనుగోలు చేసిన భూమిలో 50 ఎకరాలు మాత్రమే కమర్షియల్‌ ల్యాండ్‌గా మార్చి అన్ని అనుమతుల పొందారు. మూడు నెలల నుంచి టైల్స్‌ కంపెనీ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. మరో బడా భూస్వామి కూడా పెద్ద పెద్ద భవంతులను నిర్మిస్తున్నారు. బడా భూస్వాముల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములపై స్థానిక అధికార పార్టీ నాయకులు పలుమార్లు మండల స్థాయి అధికారులు నుంచి కలెక్టర్‌ వరకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది.

ఏకో జోన్‌ పరిధిలోకి...

నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి రెండు కిలో మీటర్ల రేడియాష్‌ పరిధిలో పొగలు వెలువడే పరిశ్రమలు, శబ్దాలు వచ్చే కంపెనీలు నిర్మించకూడదు. టైల్స్‌ కంపెనీ పక్షుల కేంద్రానికి రెండు కిలోమీటర్ల లోపే ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కంపెనీ ఏర్పాటుకు వన్య ప్రాణి విభాగం అధికారులు ఎలా అనుమతి ఇచ్చారోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



నెలబల్లి ప్రాంతంలో టైల్స్‌ కంపెనీకి ఏర్పాటు చేసిన దారి



కార్మికుల కోసం ఆక్రమిత భూముల్లో నిర్మించిన షెడ్లు

సప్లయ్‌ చానల్‌ పూడ్చేశారు



నెలబల్లి గ్రామ పరిధిలోని పెద్ద చెరువు కింద 700 ఎకరాలు సాగు అవుతుంది. దీనికి ప్రధానంగా నీటిని తీసుకువచ్చే సప్లయ్‌ చానల్‌ను భూస్వాములు ఆక్రమించి పూడ్చేశారు. సీజేఎఫ్‌ఎస్‌ పంట పొలాల్లో వెళ్లే మార్గాన్ని కూడా ఆక్రమించేశారు. ఈ విషయాన్ని ఇరిగేషన్‌ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు.

– పేరత్తూరు రామయ్య, నెలబల్లి

కుంటి సాకులు చెబుతున్నారు



నెలబల్లి రెవెన్యూలోని పలు సర్వే నంబర్లలోని 100 ఎకరాల ప్రభుత్వ భూమి భూస్వాముల ఆధీనంలో ఉంది. దీనిపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం. ఆ భూమిలో ముళ్ల పొదలు ఉన్నాయని, సర్వే చేయలేమని చెప్పి తప్పించుకుంటున్నారు. ప్రభుత్వ భూమిని సర్వే చేసి పేదలకు ఇవ్వాలి.

– సీహెచ్‌ రాధాకృష్ణయ్య, నెలబల్లి

విచారించి చర్యలు చేపడతాం



నెలబల్లి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి ఆక్రమణ విషయం నా దృష్టికి రాలేదు. దీనిపై ఎవరైనా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే సర్వే చేపడతాం. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమని స్వాధీనం చేసుకుంటాం.

– పి.శైలకుమారి, తహసీల్దార్‌, డీవీ సత్రం

మా పరిధిలోకి వస్తే కట్టడాలు నిలిపివేస్తాం



ఏకో నిబంధనలను అతిక్రమించి పరిశ్రమలు నిర్మిస్తే పరిశీలించి కట్టడాలను నిలిపివేస్తాము. పక్షుల కేంద్రానికి రెండు కిలోమీటర్లు రేడియాష్‌ లోపు కాలుష్యం వచ్చే పరిశ్రమలకు అనుమతి లేదు. నెలబల్లి ప్రాంతంలో నిర్మిస్తున్న పరిశ్రమ వద్దకు తమ సిబ్బందిని పంపి విచారణ చేయిస్తాం. అనుమతి లేకుంటే పనులు నిలిపేస్తాం.

– శామ్యూల్‌, డీఎఫ్‌ఓ, సూళ్లూరుపేట సబ్‌ డివిజన్‌

ఐఎస్టీ పీడీకి అభినందనలు



పీడీ మల్లికార్జున్‌రెడ్డిని అభినందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్‌ ఎన్‌బీకేఆర్‌ ఐఎస్టీలో పీడీగా పనిచేస్తున్న వి.మల్లికార్జున్‌రెడ్డికి జేఎన్‌టీయూఏ 2024 విద్యా సంవత్సరానికి ఉత్తమ వ్యాయామ అధ్యాపకుడి అవార్డు అందజేసింది. ఆయనను శనివారం కళాశాల కరస్పాండెంట్‌ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్‌ విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

18 నుంచి క్రీడాకారుల ఎంపిక

సూళ్లూరుపేట/సూళ్లూరుపేట రూరల్‌ : మండలంలోని కోటపోలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 18, 19, 20 తేదీల్లో ఎస్‌జీఎఫ్‌ మండల స్థాయి క్రీడా పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్టు ఎంఈవోలు కె.శ్రీనివాసులు, ఎస్‌.శ్రీనివాసులు తెలిపారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ అండర్‌-14, అండర్‌- 17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్‌, చెస్‌, బ్యాడ్మింటన్‌, యోగా, అథ్లెటిక్స్‌లో పోటీలు ఉంటాయన్నారు. అకడమిక్‌ మానిటరింగ్‌ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అండర్‌ -14 విభాగంలో పాల్గొనే వారు 2011 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. అలాగే అండర్‌-17 విభాగంలో పాల్గొనే వారు 2008 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాల ఎస్‌జీఎఫ్‌ సమన్వయ కర్త సన్నాయి భాస్కర్‌ తెలిపారు. వివరాలకు 9347038584లో సంప్రదించాలని కోరారు.

రోడ్డును బాగు చేయాలని నిరసన

చిల్లకూరు : మండలంలో జాతీయ రహదారి నుంచి గుమ్మళ్లదిబ్బ వరకు ఉన్న రోడ్డును బాగు చేయాలని పారిచెర్లవారిపాళెం గ్రామస్తులు శనివారం వాహనాల రాక పోకలను అడ్డుకుని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సాగరమాల రోడ్డు కాంట్రాక్టు సంస్థ టిప్పర్లు వెళ్లడంతో రోడ్డు దెబ్బతినిందన్నారు. విషయం తెలుసుకున్న కాంట్రాక్టు సంస్థ ప్రతినిధి ప్రసన్నకుమారరెడ్డి అక్కడికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. వారంలో రోజుల్లో రోడ్డు పనులు చేపట్టి దుమ్ము రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీవారి అలంకార మండపంలో హోమాలు నిర్వహించేందుకు హోమ గుండాలను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. స్వామివారి ఆలయంలో జరిగే నిత్య పూజలు, ఉత్సవాలు తదితరాల్లో తెలిసీ తెలియక జరిగే దోషాల నివారణకు పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆదివారం రాత్రి అంకురార్పణతో పవిత్రోత్సవాలు ప్రారంభవుతాయని వివరించారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

నాయుడుపేట టౌన్‌ : విజయవాడ వరద బాధితులకు శనివారం నాయుడుపేట పట్టణంలోని క్లాత్‌ మర్చంట్స్‌ అసోసియేషన్‌ నాయకులు రూ.లక్ష విరాళాలు సేకరించారు. సీఎం రిలీఫ్‌ ఫండ్‌ పేరుతో శనివారం డీడీ కూడా తీశారు. ఈ డీడీని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం ద్వారా ముఖ్యమంత్రికి పంపనున్నట్లు నాయకులు తెలిపారు. అదేవిధంగా బులియన్‌ (బంగారు దుకాణాలు) మర్చంట్స్‌ అసోసియేషన్‌ నాయకులు రూ.1 50 లక్షల విరాళాలు సేకరించారు. వారు శనివారం రాత్రి మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యంను కలిసి డీడీని అందజేశారు.

గూడూరులో..

గూడూరు రూరల్‌ : విజయవాడ వరద బాధితుల కోసం శనివారం గాయత్రి పాఠశాల విద్యార్థులు విరాళాలు సేకరించారు. పాఠశాల కరస్పాండెంట్‌ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తాము సేకరించిన విరాళాలను సీఎం రిలీఫ్‌ ఫండ్‌కు పంపుతామని తెలిపారు.



రూ.లక్ష డీడీని చూపుతున్న క్లాత్‌ మర్చంట్స్‌ అసోసియేషన్‌ నాయకులు

విశ్రాంత ఉద్యోగి రూ.25 వేల విరాళం

వరద బాధితుల కోసం గూడూరు రెండో పట్టణం మాళవ్యానగర్‌కు చెందిన విశ్రాంత అసిస్టెంట్‌ కమర్షియల్‌ ట్యాక్స్‌ ఆఫీసర్‌ మద్దూరు రాంప్రసాద్‌ రూ.25 వేలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు చెక్కును శనివారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు అందజేశారు. చెంచురామయ్య, ఇజ్రాయేల్‌ కుమార్‌, అబ్దుల్‌ రహీం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

రాపూరు: ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్‌ వైస్‌ చైర్మన్‌ విజయకుమార్‌ తెలిపారు. ఆయన శనివారం గండూరుపల్లి, తూమాయి గ్రామాల్లో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేస్తున్న నిమ్మ, కంది, మునగ పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమి సజీవంగా ఉంటుదన్నారు. పంటల్లో జీవామృతం వినియోగించడం వలన భూమి గుల్లబారి భూసారం దెబ్బతినకుండా ఉంటుందన్నారు. పంటలకు నీటి వినియోగం తగ్గుతుందని వివరించారు. ఈ ఏడీఏ సత్యవాణి, ఆత్మ పీడీ శివనారాయణ, ఏడీఏ శివ నాయక్‌, ఏవో సోమసుందర్‌, మాలకొండయ్య, మునిరత్నం, సుబ్బయ్య, వెంకురెడ్డి పాల్గొన్నారు.

వినాయకుడి లడ్డు రూ.1.55 లక్షలు



లడ్డును ఊరేగింపుగా తీసుకువెళుతున్న యువత

నాయుడుపేట టౌన్‌ : నాయుడుపేటలోని రాజగోపాలపురం 3వ వీధిలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి విగ్రహం వద్ద శనివారం రాత్రి లడ్డు వేలం వేశారు. కోట్రమంగళ మనోజ్‌ కుమార్‌రెడ్డి, దర్శి ప్రకాష్‌ రూ.1.55 లక్షలకు లడ్డును దక్కించుకున్నారు. అదే విధంగా స్వామి వారి మెడలో న్న నగదు మాలను రూ.90 వేలకు సూర్య, శరవణ పాడుకున్నారు. అనంతరం వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు.

ముత్యాలమ్మ ఉత్సవాల నిర్వహణకు టెండర్‌

చిల్లకూరు : తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి టెండర్ల ప్రక్రియను శనివారం ఈవో, కమిటీ సభ్యులు చేపట్టారు. ఈఓ నవీన్‌కుమార్‌ మాట్లాడుతూ ఆలయంలో పూల అలంకరణ, విద్యుత్‌ దీపాల ఏర్పాటు, ప్రసాదాల తయారీ, అమ్మవారి నవరాత్రుల ప్రత్యేక అలంకరణ పనులను టెండర్‌ ద్వారా అప్పగిస్తున్నట్టు తెలిపారు.

ట్రాక్టర్‌ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు

కోట: మండలంలోని చంద్రశేఖరపురం వద్ద శనివారం ట్రాక్టర్‌ బోల్తా పడి డ్రైవర్‌ గాయపడ్డాడు. ఊనుగుంటపాళెంకు చెందిన ఏడుకొండలు ట్రాక్టర్‌లో విద్యానగర్‌కు వస్తున్నాడు. వాకాడు వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో ట్రాక్టర్‌ బోల్తా పడింది. డ్రైవర్‌ స్వల్పంగా గాయపడ్డాడు. అతన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నవంబర్‌ 4 నుంచి శిక్షణా తరగతులు

కోట: విద్యానగర్‌ ఎన్‌బీకేఆర్‌ ఐఎస్టీలో నవంబర్‌ 4 నుంచి 9వ తేదీ వరకు ఏఐసీటీఈ ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రాంలో భాగంగా అధ్యాపకులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్‌ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం శిక్షణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌బీకేఆర్‌లో జరిగే శిక్షణ తరగతులకు మద్రాస్‌ ఐఐటీ, వరంగల్‌, తిరుచ్చి నిట్‌, జేఎన్‌టీయూఏ సంస్థల ప్రముఖ విశ్వవిద్యాలయాలకు చెందిన నిపుణులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. అంతర్జాతీయ సంస్థలైన డసాల్‌ సిస్టం, ఆన్సిస్‌ నుంచి ప్రముఖ సాంకేతిక నిపుణులు సదస్సుకు హాజరవుతున్నట్లు తెలిపారు.

లోక్‌ అదాలత్‌లో 4,558 కేసుల పరిష్కారం

వెంకటగిరి రూరల్‌/గూడూరు రూరల్‌ : గూడూరులోని కోర్టు సముదాయం, వెంకటగిరి జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌ అదాలత్‌లో 4,558 కేసులను పరిష్కరించినట్టు ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్‌ సుల్తానా బేగం, జడ్జి అనూష తెలిపారు. ఇందులో 89 సివిల్‌, 82 క్రిమినల్‌, 2,900 ఎస్సీ, ఎస్టీ కేసులు, 1397 ఎస్‌టీసీ(పెట్టీ), 107 బ్యాంకు పీఎల్‌సీ, 9 బీఎస్‌ఎన్‌ఎల్‌ పీఎల్‌సీ కేసులు ఉన్నాయన్నారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకుని వ్యయప్రయాసలు తగ్గించుకోవాలని సూచించారు.

అదృశ్యమైన బాలిక చెన్నైలో ప్రత్యక్షం

సూళ్లూరుపేట : కనిపించకుండా పోయిన సూళ్లూరుపేట పట్టణం గాండ్లవీధికి చెందిన బాలిక(12) చెన్నైలో ప్రత్యక్షమైంది. ఆమెను పోలీసులు సురక్షితంగా తీసుకుచ్చి బంధువులకు అప్పగించారు. ఆమె శుక్రవారం ఇంటి నుంచి బయటకు వచ్చింది. తర్వాత కనిపించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆమె చెన్నై వెళ్లినట్టుగా గుర్తించి తీసుకువచ్చారు. అనంతరం సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు బంధువులకు అప్పగించారు.

ఖనిజాన్ని తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల పట్టివేత

సైదాపురం: మండలంలోని గులించెర్ల సమీపంలో అనుమతులు లేకుండా ముడి ఖనిజాన్ని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్‌ చేసినట్టు ఎస్‌ఐ క్రాంతికుమార్‌ తెలిపారు. వాటిని సోమవారం జిల్లా మైనింగ్‌ అధికారులకు అప్పగిస్తామన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఖనిజం, ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూడు రోజులు రైల్వే గేటు మూసివేత

వెంకటగిరి రూరల్‌ : రైల్వే ట్రాక్‌ మరమ్మతుల వల్ల వెంకటగిరి–నాయుడుపేట రోడ్డులో ఉన్న రైల్వేగేటును సోమవారం నుంచి బుధవారం వరకు మూసివేయనున్నట్లు రైల్వే సీనియర్‌ సెక్షన్‌ ఇంజినీర్‌ ఆర్‌ స్వామినాథన్‌ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బస్సులు, లారీలు తదితర పెద్ద వాహనాలను నిడిగల్లు, ఊట్లపల్లి గ్రామాల మీదుగా నాయుడుపేట వైపు, ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలను పాత పెట్లూరు రోడ్డు మార్గం గుండా రాగపోకలు సాగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు వాహనదారులు సహకరించాలని కోరారు.

కోడ్‌ క్రాఫ్టార్స్‌ క్లబ్‌తో విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి

గూడూరు రూరల్‌ : గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్‌ కళాశాలలో శనివారం కోడ్‌ క్రాఫ్టార్స్‌ క్లబ్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపాల్‌ వేణుమాదవ్‌ మాట్లాడుతూ క్లబ్‌ ద్వారా విద్యార్థుల్లో కోడింగ్‌ నైపుణ్యాలను పెంపొందిస్తామన్నారు. అకడమిక్‌ డీన్‌ రాజయ్య, సీతఈవో ఇమ్మానుయేల్‌, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో వెంకటగిరి మండల విద్యార్థి

సామర్లకోట: తిరుపతి జిల్లాకు చెందిన ఒక విద్యార్థి ఇంటి నుంచి వచ్చి కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. సామర్లకోట రైల్వే పోలీసులు శనివారం మూడో నంబరు ప్లాట్‌ఫాంపై అనుమానాస్పద స్థితిలో ఉన్న విద్యార్థిని గుర్తించారు. అతడిని ప్రశ్నించగా తాను తప్పిపోయి వచ్చానని, తన పేరు షేక్‌ మస్తాన్‌ అని, తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం మూసాపేట అని, 9వ తరగతి చదువుతున్నట్లు తెలిపాడు. ఆ విద్యార్థిని రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చి వెంకటగిరి పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అప్పటికే అతడు కనిపించడం లేదని తల్లిదండ్రులు షబీహ, జమీల్‌ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చిన్నట్లు రైల్వే ఎస్‌ఐ బి.లోవరాజు తెలుసుకుని వారికి సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు వచ్చిన తర్వాత విద్యార్థిని అప్పగిస్తామని తెలిపారు.